sahanamvande.com

epaper.sahanamvande.com

సహానం వందే

హైదరాబాద్ | 28-09-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 159 EDITOR: ROHINI



ఫ్రెండ్స్ బ్రోకర్లు... పెళ్లిళ్ల పేరయ్యలు

డేటింగ్ యాప్‌లలో నయా రెవల్యూషన్

- జంటలను కలిపే కొత్త లవ్ గేమ్ షురూ
- అల్గారిథమ్స్‌కు చెక్ పెట్టిన సోషల్ మ్యాచింగ్
- మార్కెట్లోకి వచ్చిన 'రివెట్' డేటింగ్ యాప్

రోజూ బొటనవేలు అరిగేలా ఫోన్ స్క్రీన్‌పై రైట్, లెఫ్ట్ స్వైప్‌లు చేసి చేసి విసిగిపోయారా? తీరా ఎవరో ఒకరితో మ్యాచ్ అయ్యాక ఛాటింగ్ మొదలుపెడితే... అవతలి వ్యక్తి ఫేక్ ప్రొఫైలా లేక టైమ్‌పాస్ బ్యాచా అని తేలేసరికి సగం జిందగీ అయిపోతోందా? ఇక ఆ గుడ్డి స్వైపింగ్ కష్టాలకు చెక్ పడబోతోంది! మన ఊర్లలో పాతకాలం నాటి పెళ్లిళ్ల పేరయ్యలు, చుట్టాలు కలిసి జంటలను కుదిర్చినట్లే... ఇప్పుడు మన సొంత ఫ్రెండ్స్ కలిసి మనకు జోడీని సెట్ చేసే ఒక క్రేజీ ఐడియాతో వచ్చిందే 'రివెట్' యాప్. అసలు ఈ యాప్ ఎలా పనిచేస్తుంది? ఫ్రెండ్స్ ఎలా పేరయ్యలుగా మారుతారో చూద్దాం!

- సహనం వందే, హైదరాబాద్

రివెట్ యాప్‌లో ఉన్న అసలైన మ్యాజిక్ ఏంటంటే... ఇక్కడ మీరు కేవలం ప్రొఫైల్ క్రియేట్ చేసుకుని ఖాళీగా కూర్చోవడం కాదు. మీతో పాటు మీ క్లోజ్ ఫ్రెండ్స్ కూడా ఈ ప్రాసెస్ లో కీలక భాగస్వాములు అవుతారు. మీ ఫ్రెండ్స్ మీకు తగిన జోడీలను రికమండ్ చేయడమే కాకుండా, వేరే వాళ్లు మ్యాచ్ అయినప్పుడు వారి గురించి ఫీడ్‌బ్యాక్, రేటింగ్స్ కూడా ఇస్తారు.

మీ బెస్ట్ ఫ్రెండ్స్ ఇచ్చే క్యారెక్టర్ సర్టిఫికేట్ బట్టే మీ ప్రొఫైల్ మ్యాచింగ్ స్కోర్ డిసైడ్ అవుతుంది. దీనివల్ల ఫేక్ ప్రొఫైల్స్ దెబ్బకు ఫిల్టర్ అయిపోయి, జెన్యూన్ వ్యక్తులు మాత్రమే ముందుకు వస్తారు.

ఫ్రెండ్స్‌ను యాడ్ చేసుకునే ప్రత్యేక ఆప్షన్

చాలామందికి ఒక డౌట్ రావచ్చు... అసలు ఫ్రెండ్స్ ఈ యాప్‌లోకి ఎలా వస్తారు, ఎలా రికమండ్ చేస్తారు అని! మీ రివెట్ ప్రొఫైల్‌కు ఫ్రెండ్స్‌ను యాడ్ చేసుకోవడానికి ఒక ప్రత్యేక మైన ఆప్షన్ ఉంటుంది. మీ దోస్తులు కనెక్ట్ అయ్యాక వాళ్లు మీకు సరిపోయే ప్రొఫైళ్లను నేరుగా మీ వాల్‌పైకి సజెస్ట్ చేయవచ్చు. వీరిద్దరి అభిరుచులు, మైండ్‌సెట్ ఒకేలా ఉన్నాయి, పర్ఫెక్ట్ జోడీ అవుతారని మీ ఫ్రెండ్ ఆమోదముద్ర వేస్తేనే ఆ ప్రొఫైల్ మీకు హైలైట్ అవుతుంది.

అల్గారిథమ్స్ వర్సెస్ హ్యూమన్ టచ్!

పాత డేటింగ్ యాప్‌లకు, ఈ కొత్త రివెట్ యాప్‌కు ఉన్న ప్రధాన తేడా... అల్గారిథమ్స్ వర్సెస్ హ్యూమన్ టచ్! పాత యాప్‌లలో లొకేషన్, వయస్సు ఆధారంగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆటోమేటిక్‌గా మ్యాచ్‌లను చూపేది. కానీ మెషిన్లకు మనుషుల నిజమైన ప్రవర్తన, గుణగణాలు తెలియవు కదా! రివెట్ మాత్రం ఆ నిర్జీవమైన ఏఐ అల్గారిథమ్‌లను పక్కనబెట్టి మనల్ని బాగా అర్థం చేసుకున్న మనుషుల నమ్మకానికే మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. ఈ కొత్త పద్ధతి వల్ల యూజర్లకు దక్కే ప్రయోజనం ఏంటంటే నమ్మకం. డేటింగ్ యాప్‌లలో ప్రొఫైల్ చూసి ఒకరిని నమ్మడం కష్టం. కానీ ఒకరి వెనుక ఫ్రెండ్స్ రికమండేషన్లు, పాజిటివ్ స్కోర్ కనిపిస్తే ఆటోమేటిక్‌గా నమ్మకం పెరుగుతుంది. గుడ్డిగా లైక్ కొట్టి మోసపోకుండా మొదటి రోజే జెన్యూన్ గ్యారెంటీతో సంభాషణలు మొదలుపెట్టవచ్చు. ఫ్రెండ్స్ నెట్‌వర్క్ ద్వారా అప్పటికే ఫిల్టర్ అయిన మ్యాచ్‌లు మాత్రమే మీ ముందుకు వస్తాయి. దీనివల్ల చాటింగ్ దశలోనే అవతలి వారి ఉద్దేశం ఏంటో స్పష్టంగా తెలిసిపోతుంది.

డిజిటల్ యుగంలో పెళ్లిళ్ల పేరయ్యలు...

గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిళ్ల పేరయ్యలు "ఆ అబ్బాయి మంచివాడు, ఆ అమ్మాయి గుణవంతురాలు" అని గ్యారెంటీ ఇచ్చి బంధాలు కుదిర్చేవారు. ఇప్పుడు అదే సాంప్రదాయక భావనకు రివెట్ మోడరన్ టెక్నాలజీ టచ్ ఇచ్చింది. డిజిటల్ యుగంలో మీ బెస్ట్ ఫ్రెండ్సే ఆనాటి పేరయ్యల పాత్రను పోషిస్తూ, మీకు కాబోయే భాగస్వామిని ఎంచుకోవడంలో మార్గదర్శకులుగా మారుతున్నారు. సింగిల్స్‌కి నమ్మకమైన భాగస్వాములను అందించడమే కాకుండా డిజిటల్ డేటింగ్ రంగాన్నే కొత్త మలుపు తిప్పుతున్న ఈ కాన్సెప్ట్ వెనుక పక్కా బిజినెస్ ప్లాన్ కూడా ఉంది. డేటింగ్ పరిశ్రమలో సుదీర్ఘ అనుభవం ఉన్న టిండర్ ఇండియా, మ్యాచ్ గ్రూప్ మాజీ అధిపతి తరూ కపూర్, రజత్ సాహ్ని కలసి గతేడాది ఈ యాప్‌ను ప్రారంభించారు. మార్కెట్‌లోని లోపాలను పసిగట్టి వారు రూపొందించిన ఈ 'సోషల్ మ్యాచింగ్' ప్లాన్ ఇన్వెస్టర్లను విపరీతంగా ఆకట్టుకుంది.

అమెరికా మార్కెట్లో ఈ నయా ట్రెండ్

మొత్తానికి రోబోటిక్ అల్గారిథమ్‌ల స్థానంలో స్నేహితుల సిఫార్సులను తీసుకొచ్చి డేటింగ్ యాప్‌ల భవిష్యత్తును రివెట్ పూర్తిగా మార్చేస్తోంది. అమెరికా మార్కెట్లో మొదలవుతున్న ఈ నయా ట్రెండ్ త్వరలోనే ప్రపంచమంతటా పాకడం ఖాయంగా కనిపిస్తోంది. సాంకేతికత ఎంత ముందుకు వెళ్లినా మనుషుల నమ్మకమే అసలైన గెలుపు అని ఈ యాప్ నిరూపిస్తోంది. కళ్ల ముందుకు వచ్చే ప్రతి ప్రొఫైల్‌ను నమ్మి మోసపోయే కంటే, మన మంచి చెడులు తెలిసిన సొంత ఫ్రెండ్స్ ఇచ్చే రికమండేషన్స్ ఎప్పుడూ సేఫ్ కదా!

ఫుడ్ సేఫ్టీ పబ్లిసిటీ పిచ్చి

హోటళ్లపై ఉత్తుత్తి దాడులు

- లైసెన్సులు రద్దు చేసిన తెల్లారే మళ్లీ ఓపెన్
- మామూళ్ల మత్తులో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్
- వారి ప్రచార పిచ్చికి పౌరుల ప్రాణాలు బలి

వారాంతాల్లో కుటుంబంతో కలిసి కాస్త సంతోషంగా తిందామని హోటలుకు వెళ్తే... మన పళ్లెంలో వడ్డిస్తున్నది ఆహారం కాదు, పచ్చి విషం! తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు రోజుకో ప్రముఖ రెస్టారెంట్‌పై దాడి చేయడం... కుళ్ళిన మాంసం, గడువు తీరిన ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ కెమెరాల ముందు హంగామా చేయడం చూస్తూనే ఉన్నాం. ఐతే, ఈ దాడులన్నీ నిజంగా ప్రజారోగ్యం కోసమా? లేక అధికారుల పబ్లిసిటీ పిచ్చి కోసమా? లైసెన్సులు రద్దు చేశామని, హోటళ్లను మూసేశామని ఘీంకరించిన 48 గంటల్లోనే... అదే రెస్టారెంట్లు మళ్లీ విద్యుత్ కాంతులతో కిటకిటలాడుతున్నాయి! అసలు చట్టమంటే అధికారులకు, వ్యాపారులకు భయం లేకుండా పోయిందా? ఈ నోటీసుల నాటకం వెనుక జరుగుతున్న దందా ఏంటి? - సహనం వందే, హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్లలో అధికారులు జరుపుతున్న సోదాలు కేవలం ఒక మీడియా సర్కస్‌లా మారాయి. పైకి రంగురంగుల లైటింగ్స్, కళ్లుచెదిరే ఇంటీరియర్స్‌తో మెరిసిపోయే టాప్ రెస్టారెంట్లలో కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, పురుగులు పట్టిన మసాలాలు వాడుతున్నారని ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వదులుతున్నారు. లైసెన్సులను తక్షణమే రద్దు చేశామని, సీల్ వేస్తున్నామని పెద్ద ఎత్తున డప్పు కొట్టుకున్న ఈ ఆర్భాటపు ప్రకటనలు కేవలం ఒక్క రోజు ముచ్చటేనని మరుసటి రోజే రుజువవుతోంది.

బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామని రచ్చ...

గచ్చిబౌలిలోని శివాని ది రెస్టారెంట్ & బార్, అల్ సబా, మాదాపూర్ లోని లక్కీ మల్టీక్యూసిన్, సాయి రామ్ మెస్, ఉడిపిస్ ఉపహార్, కోల్ స్పార్క్, కంచి కేఫ్‌లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామని సోషల్ మీడియాలో రచ్చ చేశారు. ఇవన్నీ తీవ్ర నాణ్యతా లోపాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని తేల్చి చెప్పారు. మరి, మూసివేసిన హోటళ్ల బోర్డులు రెండు రోజుల్లోనే మళ్లీ ఎలా వెలిగిపోతున్నాయి? అధికారుల 'అదృశ్య హస్తం' లంచాల మత్తులో తూగుతోందా?

అంతేరాలో మళ్లీ ఓపెన్...

హైటెక్ సిటీలో బ్రాండెడ్లుగా పేరుపొందిన అంటెరా కిచెన్ & బార్, ఆమ్ ఆహా తెలుగు కిచెన్, ఇన్‌ఆర్బిట్ మాల్‌లోని ఫ్యూజన్ 9, అమ్మీషి యా స్కై బార్‌లతో పాటు చార్మినార్ వద్ద ఉన్న ప్రసిద్ధ షాదాబ్ రెస్టా రెంట్‌పై రైడ్లు చేసి అక్కడ నడుస్తున్న చట్టవిరుద్ధమైన వ్యవహారాలను బహిర్గతం చేశామన్నారు. కానీ అంతా పబ్లిసిటీ స్టంట్! చర్యలు తీసుకున్నామన్న ఒక్క రోజులోనే ఇవన్నీ మళ్లీ కస్టమర్లతో కిటకిటలాడుతుంటే.. అసలు అధికారులు సాధించింది ఏంటి? లైసెన్స్ రద్దయిన మరుసటి రోజే రెస్టారెంట్లు యథేచ్ఛగా తెలుసుకోవడంతో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌పై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసివేసిన రెస్టారెంట్ రెండు రోజుల్లో ఎలా ఓపెన్ అవుతుంది? వెనకాల ఎన్ని లక్షల మామూళ్లు చేతులు మారాయి? అని నేరుగా ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలంటే అధికారులకు, యజమానులకు కేవలం వ్యాపార వస్తువుగా మారిపోయింది. ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న లాలూచీ ఏంటి?

అధికారులు మౌనం...

చట్ట ప్రకారం ఒకసారి లైసెన్స్ రద్దయితే దాన్ని అధిగమించి హోటల్ నడపడం తీవ్రమైన నేరం. కానీ చట్టాన్ని యథేచ్ఛగా ధిక్కరిస్తుంటే అధికారులు మౌనంగా చూస్తున్నారు. కేవలం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు పెడితే సరిపోతుందా? శాశ్వత పర్యవేక్షణ ఏది? హోటళ్లను సీల్ చేశారా లేదా అనేది పారదర్శకంగా ఎందుకు చెప్పడం లేదు? ఈ వ్యవహారం చూస్తుంటే దాడులన్నీ ప్రజలను మోసం చేసేందుకు ఆడుతున్న డ్రామాగా స్పష్టమవుతోంది. సామాన్యుడు చిన్న తప్పు చేస్తే చట్టాన్ని కఠినంగా అమలు చేసే అధికారులు, వందల కోట్ల టర్నోవర్ ఉన్న పెద్ద పెద్ద రెస్టారెంట్ల విషయంలో ఎందుకు లొంగిపోతున్నారు? రెండు రోజుల్లోనే ఆ లైసెన్సులు ఎలా పునరుద్ధరణ పొందుతున్నాయి? అక్కడి అపరిశుభ్రత అంత వేగంగా మాయమైపోయిందా? ఈ ప్రశ్నలకు ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ వద్ద సమాధానం లేదు.

ప్యారడైజ్‌కు కేసీఆర్ జోష్

థియేటర్లలో అభిమానుల పూనకాలు

- కేసీఆర్, కేటీఆర్ బ్యానర్లతో హంగామా
- గులాబీ పార్టీకి జోష్ ఇచ్చిన నాని సినిమా
- నైజాం నుండి అమెరికా దాకా జడల్ శివాల్
- ప్లాప్ అనుకున్న సినిమా దుమ్ములేపుతోంది

సినిమా అంటే కేవలం వినోదం మాత్రమేనా? లేక రాజకీయాలను, ప్రజల సెంటిమెంట్లను కూడా ఉర్రూతలూగించే ఒక శక్తివంతమైన సాధనమా? ఈ ప్రశ్నకు సమాధానం కావాలంటే ఇప్పుడు థియేటర్లలో నడుస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా జాతర చూడాల్సిందే. అసలు ఈ చిత్రం గులాబీ పార్టీకి ఎందుకంత జోష్ ఇచ్చింది? థియేటర్ల ముందు కేటీఆర్ ఫ్లెక్సీలు, ఆయా షేర్ మంత్రాలు ఎందుకు మార్మోగుతున్నాయి? హీరో నాని రేంజ్‌ని శ్రీకాంత్ ఓదెల ఎలా మార్చేశాడు? - సహనం వందే, హైదరాబాద్

బాక్సాఫీస్ దగ్గర 'దసరా' విజయం తర్వాత నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో వచ్చిన 'ది ప్యారడైజ్' ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమాలో గులాబీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ని పోలిన ఎమ్మెల్యే శంకరన్న పాత్రను నటుడు ప్రియదర్శి ఎంతో అద్భుతంగా పోషించారు. ఈ పాత్రను తెరపై చూసిన గులాబీ శ్రేణులు, అభిమానులు థియేటర్లలో ఈలలు, కేకలతో సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమాలో అసలైన హీరో నాని పక్కకు పోయి ప్రియదర్శి ముందుకు వచ్చాడనే ప్రచారం జరుగుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ నేతల పాత్రలు ఈ రేంజ్‌లో మాస్ హంగామాకు కారణం కావడం గమనార్హం.

సినిమా చూసిన కేటీఆర్

రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌కు వెళ్లి ఈ చిత్రాన్ని వీక్షించారు. చాలా ఏళ్ల తర్వాత ఆయన స్వయంగా వచ్చి సినిమా చూడటం విశేషం. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు దీనిని చూశారు. ఆయన రాకతో అభిమానుల కోలాహలం అంబరాన్నంటింది. బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఇది కొత్త ఉత్సాహాన్ని నింపిందని చెప్పవచ్చు. నైజాం ఏరియా నుంచి నార్త్ అమెరికా వరకు ప్రతి థియేటర్ లోనూ జడల్ శివాల్ లాంటి మాస్ వాతావరణం కనిపిస్తోంది. ప్లాప్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు కేసీఆర్ పుణ్యమా అని దుమ్ములేపుతోంది.

రాక్‌స్టార్ అనిరుధ్ సంగీతమే ప్రాణం...

ఇక ఈ సినిమాకు ప్రధాన ఆయువు పట్టుగా నిలిచింది రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్. బిజిఎమ్

ప్రతి సీన్ ని వేరే లెవెల్ కి తీసుకెళ్లింది. మాస్ ఎలివేషన్స్ వచ్చినప్పుడు ఆయన ఇచ్చిన మ్యూజిక్ కి ప్రేక్షకులు ఈలలు వేస్తూ డాన్సులు చేస్తున్నారు. తెలుగు ప్రేక్షకులలో ఆయన క్రేజ్ ను ఈ చిత్రం మరోసారి ఆకాశానికి ఎత్తేసింది. "ఆయా షేర్" అనే పాట ఎక్కడ చూసినా మారుమోగిపోతోంది. ఇటీవలే జరిగిన గణేష్ మహానిమజ్జనోత్సవాల్లో కూడా ప్రతి మంటపం దగ్గర, ఊరేగింపుల్లోనూ ఈ పాట మంత్రమే వినిపించింది. ఇది హైదరాబాద్ పోలీస్ కమిషనర్ తో సైతం స్టెప్పులేయించింది. పండుగ బందోబస్తు, నిమజ్జనం సందర్భంలో ప్రజలతో పాటు ఆయన కూడా సరదాగా డాన్స్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఒక పాట పోలీస్ అధికారులను కూడా ఈ స్థాయిలో ఆకట్టుకోవడం నెట్టింట పెద్ద చర్చనీయాంశంగా మారింది.

బాలీవుడ్ వర్గాల్లోనూ హాట్ టాపిక్...

కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, బాలీవుడ్ వర్గాల్లో కూడా ఇది ఇప్పుడు ఒక హాట్ టాపిక్ గా మారింది. ఉత్తరాది విమర్శకులు, విశ్లేషకులు ఈ టేకింగ్ ను, నాని నటనను, కథనాన్ని ప్రశంసిస్తూ రివ్యూలు ఇస్తున్నారు. సౌత్ నుంచి వస్తున్న మరొక పవర్ ఫుల్ రా అండ్ రస్టిక్ మూవీగా దీనిని బాలీవుడ్ మీడియా కొనియాడుతోంది. ఇది కలెక్షన్లు రాబట్టడమే కాకుండా రాజకీయ పరంగా కూడా ఒక సంచలనానికి తెరతీసింది.